

- భూగర్భజలాలు అడుగంటి.. ఎండిన బోరుబావులు
- మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ చివరి ఆయకట్టు బీడు
- ఎన్నికల హామీగా మిగిలిపోయిన సాగునీరు

నీరందక 30 ఏళ్లు..!



కాలువ పొడవునా గండ్లు.. ముళ్లపొదలు



నిదనవాడ వద్ద ధ్వంసమై..

మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ చివరి ఆయకుట్టు భూములకు నీరు అందక ఏకంగా మూడు దశాబ్దాలు అయింది. ఒకప్పుడు పండ్ల తోటలు, పచ్చని పైర్లతో కళకళలాడిన ప్రాంతం ఇప్పుడు దీన స్థితిలో ఉంది. వర్షాలు లేక, కాలువ నీరు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరు బావులు నిర్వీర్యం కావడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. కొందరు రైతులు పెన్నా నదిలోకి కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని.. వర్షాకాలంలో సాగుకు నీటిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - శింగనమల




నాయనవారి పల్లె వద్ద కాలువ దుస్థితి

నిర్వహణ లేకనే...

మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ నిర్వహణను గత ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. దీంతో కాలువ చివరి 15 కిలోమీటర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. కాలువ పొడవునా ముళ్ల పొదలు పెరిగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు కాలువను బాగు చేసే దిశగా చొరవ చూపలేదు. చివరి ఆయకట్టుకు నీరివ్వాలని శింగనమల మండలంలోని నిదనవాడ, ఆనందరావుపేట నాయనవారిపల్లి, సలకంచెరువు గ్రామాల రైతులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించారు. కానీ 30 ఏళ్ల నుంచి ఏ ఒక్కరూ పట్టించుకోలేదు.


రెండు వేల ఎకరాలు బీడు..

శింగనమల మండలంలోని మిడ్‌పెన్నార్ 5వ దక్షిణ కాలువ దాదాపు 25 కిలోమీటర్లు ఉంటుంది. ఆ పరిధిలోని ఆయకుట్టు భూములకు సాగునీరు ఇవ్వాలి. కానీ మొదటి 10 కి.మీ. పరిధిలో మాత్రమే సాగునీరు ఇస్తున్నారు. కల్లుమడి, గుమ్మేపల్లి, తరిమెల గ్రామాలకు మా త్రమే.. అదీ.. అరకొరగా నీరు అందిస్తున్నారు. చివరి ఆయకట్టు 15 కిలోమీటర్లకు మొండిచేయి చూపుతున్నారు. సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువ దెబ్బ తిన్న కారణంగానే తమ వరకూ నీరు రావడం లేదని, తరిమెల వద్ద ఆగిపోతోందని చివరి ఆయకట్టు రైతులు అంటున్నారు.



ఆనందరావుపేట వద్ద కాలువ ఇలా..

పండ్ల తోటలను నరికేశాం..



మాది నాయనవారి పల్లె. 30 ఏళ్ల కిందట మా కాలుకకు నీరు వచ్చేది. మా ఊరి రైతులు అందరూ చీనీ, సపోటా తోటలను సాగుచేసేవాళ్లం. మా ఊరి చీనీ పండ్లకు చైన్నై, ముంబై నాగపూర్‌లో మంచి ధరలు లభించేవి. గత 30 ఏళ్ల నుంచి కాలువకు చుక్కనీరు రాలేదు వర్షాలు కూడా సక్రమంగా రావడంలేదు. వ్యవసాయ బోరు బావులు ఎండిపోతున్నాయి. ఐదొందల అడుగు వరకూ బోరు వేసినా చుక్క నీరు పడటం లేదు. దీంతో పండ్ల తోటలను నరికేశాము. నాకున్న ఐదు ఎకరాలను బీడు పెట్టాను.

- సుబ్బయ్య, రైతు

బోర్లలో నీరే లేదు...

కాలువకు నీరు వచ్చే సమయంలో ప్రతి రైతూ పండ్ల తోటలను సాగు చేసి.. ఆర్థికంగా ఎదిగారు. ఇప్పుడు చాలా సంవత్సరాలుగా నీరు రావడంలేదు. బోర్లలో కూడా నీరు తగ్గిపోయింది. పండ్ల తోటలను కాపాడుకోలేకపోయాము. ఇప్పుడు ఆర్థికంగా బాగున్న రైతులు పెన్నానదిలో బోర్లు వేసి.. అక్కడి నుంచి ఆరేడు కిలోమీటర్లు వరకు పైప్‌లైన్ వేసుకుని తోటలకు నీరు తెచ్చుకుంటున్నారు. దీనికి లక్షలకు లక్షలు ఖర్చు అవుతోంది. మా లాంటి పేద రైతులు భూములను బీడు పెట్టాము.



- భాస్కర్ రెడ్డి, నిదనవాడ



ఎన్నికల హామీతో సరి..

చివరి ఆయకట్టుకు నీరు ఎన్నికల హామీగానే మిగిలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు ఇప్పిస్తామని ఎన్నిక సమయంలో అభ్యర్థులు హామీ ఇస్తున్నారని, కానీ గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు కాలువకు నీరు చేరితో వ్యవసాయ బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తుందని అంటున్నారు. గడిచిన 30 ఏళ్ల నుంచి నీరు రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, బోర్లులో నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పండ్ల తోటలతో కళకళలాడే తమ గ్రామాలు ఇప్పుడు కరువు ప్రాంతాలుగా మారాయని వాపోతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



తరిమెల నుంచి సలకంచెరువు వరకు కాలువకు ఎక్కడ చూసినా గండ్లు పడ్డాయి. ముళ్ల పొదలతో కాలువ నిండిపోయింది. కాలువ ధ్వంసమైంది. ప్రజా ప్రతినిధులు స్పందించి.. కాలువకు మరమ్మతులు చేయించాలి. చివరి 15 కిలోమీటర్లు బాగుచేశాక నీరు వదలాలి. మా గ్రామాల రైతులకూ నీరు అందేలా చూడాలి. ఆ దిశగా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- పెద్ద నరసింహులు, ఆనందరావుపేట

ఎమ్మెల్యే స్పందించాలి..

శింగనమల మండలంలో మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ కింద చివరి ఆయకట్టుకు నీరు చేరాలంటే మొదట కాలువకు మరమ్మతులు చేయాలి. దీనికి అవసరమైన నిధులను ఎమ్మెల్యే తీసుకురావాలి. తరిమెల నుంచి సలకంచెరువు వరకు దాదాపు 15 కి.మీ. వరకు కాలువ పూర్తిగా ధ్వంసం అయింది. తరిమెల తరువాత చుక్కనీరు కూడా దిగువకు వెళ్లడం లేదు. చాలా సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతోంది. ప్రజా ప్రతినిధులు చొరవ చూపకపోవడంతో 1500 నుంచి రెండు వేల ఎకరాలకు నీరు అందడం లేదు. బోరు బావుల్లో నీరు ఇంకిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రైతు సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి.

- చిన్నప్ప యాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



ప్రజలకు మెరుగైన సేవలు

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నూతన ఎస్పీ మురళీ కృష్ణ.. బాధ్యతల స్వీకరణ



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న కేవీ మురళీకృష్ణ

అనంతపురం క్రైం, జూలై 18: జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్‌కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి ఎస్పీగా 15 నెలలు పనిచేశానని, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతిష్టాత్మకమైన అనంతపురం జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు బేసిక్ పోలీసింగ్‌లో భాగమైన అంశాలపై దృష్టి పెడతామని అన్నారు. గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి రవాణా, విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని, నిష్పక్షపాతంగా, చట్టపరంగా వ్యవహరిస్తామని అన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, వారిపై నేరాలకు పాల్పడినా కఠిన శిక్షలు పడేలా చూస్తామని అన్నారు. మెరుగైన సేవల కోసం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాల సహకారం తీసుకుంటామని అన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమంపై దృష్టి సారిస్తామని అన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఐజీ షిమోషిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, పోలీస్ అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీలు ప్రతాప్, శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, జనార్దన్‌నాయుడు, శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, పోలీస్ కార్యాలయ ఏఓ శంకర్, సీఐలు ఇందిర, షేక్ జాకీర్, రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇస్మాయిల్, వెంకటేష్ నాయక్, రామకృష్ణారెడ్డి, దేవానంద్, నరేంద్రరెడ్డి, మునిస్వామి, సంజీవులు, వెంకట్రామిరెడ్డి, శ్రీధర్, హరినాథ్, నాగరాజు తదితరులు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సురక్షిత ప్రయాణం చేయండి

● జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి, న్యాయవాదులు

అనంతపురం క్రైం, జూలై 18: హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ, బార్ అసోసియేషన్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై నగరవాసులకు గురువారం అవగాహన కల్పించారు. జిల్లా కోర్టు నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, విజయనగర లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీస్ స్టేషన్..!

- తాడిపత్రిలో సీఐ ఒక్కరే..!
- నెల రోజులుగా ఎస్ఐ పోస్టు ఖాళీ
- ఏడాదిలో మారిన సీఐలు ఆరుగురు
- 30 వేల జనాభాకు 30 మంది పోలీసులూ లేరు
- ఉన్నవారికి పనిభారం
- రెచ్చిపోతున్న దొంగలు..



ఎన్నికల సమయంలో తాడిపత్రిలో రాళ్ల దాడి



తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్

తాడిపత్రి, జూలై 18: రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో మొదటి వరుసలో ఉండే తాడిపత్రికి పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ ప్రాంతంలో చిన్న సమస్య తలెత్తినా చినికి చినికి గాలివానగా మారుతుంది. ఎన్నికల సమయంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుంది. రెండు నెలల క్రితం జరిగిన దాడులు, ప్రతిదాడులు ఈ ప్రాంతంలో శాంతిభద్రతల సమస్య ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెబుతాయి. కానీ సిబ్బంది కొరత కారణంగా సమస్యను సకాలంలో పరిష్కరించలేకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో తగినంత సిబ్బంది లేరు. దీంతో నేరాలను అరికట్టడం, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీసు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరికి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవడానికి కూడా తగిన సిబ్బంది లేకపోవడం గమనార్హం. నాయకుల రాజకీయ విభేదాలు, ఒత్తిళ్ల కారణంగా ఇక్కడికి వచ్చేందుకు పోలీసు అధికారులు సైతం జంకుతారు. ధైర్యంచేసి వచ్చిన అధికారులు రెండు నెలలకు మించి నిలవలేకపోతున్నారు. ఏడాది వ్యవధిలో ఆరుగురు సీఐలు మారడం దీనికి నిదర్శనం. తరచూ పోలీసు అధికారులు మారుతుండటంతో నేరాల అదుపు సాధ్యం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు స్థిరంగా ఉంటే ఈ ప్రాంత సమస్యలపై అవగాహన పెరుగుతుంది, తద్వారా నేర నియంత్రణ సాధ్యమౌతుంది.

నిలవలేకున్న సీఐలు

తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏడాది వ్యవధిలో ఆరుగు సీఐలు మారారు. దీనికి ఒత్తిళ్లే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏడాది క్రితం వచ్చిన సీఐ ఆనందరావు దాదాపు 10 నెలలు విధులపాటు విధులు నిర్వహించారు. ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో.. ఆ స్థానంలో హమీద్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. వివిధ రకాల ఆరోపణలు రావడంతో ఐదునెలలకే ఉన్నతాధికారులు ఆయనను వీఆర్‌కు పంపారు. ఈ స్థానంలో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ట్రైనీ డీఎస్పీగా ఉన్న హేమంత్‌కుమార్ రెండు నెలలపాటు సీఐ విధులు కూడా నిర్వహించాల్సి వచ్చింది. ఆ తరువాత సీఐగా వచ్చిన మురళీకృష్ణ.. ఎన్నికల గొడవల కారణంగా సస్పెండ్ అయ్యారు. ఆ వెంటనే నాగేంద్రప్రసాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూడా ఒత్తిళ్లు భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో బాధ్యతలు తీసుకున్న ఇస్మాయిల్.. కేవలం పదిరోజులు ఉన్నారు. ఆయన స్థానంలో నాగేంద్రప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఎస్ఐ పోస్టు ఖాళీ

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు నెలరోజుల నుంచి ఖాళీగా ఉంది. ఈ స్థానాన్ని భర్తీ చేయాల్సిన అధికారులు.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎస్ఐ స్థాయి అధికారి లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది కొన్ని ఫిర్యాదులు తీసుకోవడంలేదు. దీంతో బాధితులు అసంతృప్తితో వెనుదిరిగి వెళుతున్నారు. నిబంధనల మేరకు తాడిపత్రి పట్టణ జనాభాకు అనుగుణంగా పోలీస్ స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 10 మంది, కానిస్టేబుళ్లు 42 మంది ఉండాలి. కానీ 30 వేల జనాభా ఉన్న తాడిపత్రికి ఈ మాత్రం సిబ్బంది, అధికారులు కూడా లేరు.

సీఐకి పనిభారం

రాజకీయ ఒత్తిళ్లు, నేరాలను అరికట్టడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం వంటి పనులు పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్‌కు భారంగా మారాయి. సిబ్బంది కొరత కారణంగా నేరాలను అరికట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. నెలరోజుల వ్యవధిలో వరుసగా ఐదు దొంగతనాలు జరగడం సమస్యను ఎత్తిచూపుతోంది. బాధితులు పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కానీ దొంగల ఆచూకీ లభ్యం కాలేదు. పట్టణం నలువైపులా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో కొన్ని పనిచేయడం లేదు. రాత్రి వేళల్లో బీట్ విధులకు సిబ్బంది వెళ్లడం లేదు. దీంతో దొంగలు మరింత రెచ్చిపోతున్నారు.

సిబ్బందిని నియమించరా..?

తాడిపత్రి పట్టణంలో గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఏకంగా ముగ్గురు ఎస్ఐలు విధులు నిర్వహించారు. అప్పట్లో దొంగతనాలు గాని, రాజకీయ దాడులుగాని జరగలేదు. ఆ సమయంలో సీఐ, ఎస్ఐలతోపాటు ట్రాఫిక్ ఎస్ఐ కూడా ఉండేవారు. ప్రస్తుతం సీఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 17 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. సమస్యలు రాజ్యమేలుతున్న సమయంలో ఎస్ఐ కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌ను నెల క్రితం పెద్దపప్పూరు స్టేషన్‌కు ఇన్‌చార్జిగా వేశారు. దీంతో ఆయన అక్కడికి వెళ్లారు. సిబ్బంది కొరత వేధిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇది మా స్థలం.. బయటికెళ్లు..!

అంగన్‌వాడీ కార్యకర్తను గెంటేసిన వైసీపీ వర్గీయుడు



ఎంపీడీఓకి ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కుందుర్పి, జూలై 18: తమ్మయ్యదొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తను వైసీపీ వర్గీయుడు మాంతేష్ గురువారం బయటకు గెంటేశాడు. ఆ భవనం ఉన్న స్థలం తమదని బెదిరించాడని అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి వాపోయారు. గ్రామంలో ఎనిమిదేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనాన్ని నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని తాగునీటి బోరు నుంచి మాంతేష్.. తన పొలానికి నీటిని తరలించేవాడు. దీంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఇటీవల నీటి చౌర్యాన్ని అడ్డుకున్నారు. ఇదంతా జరగడానికి తానే కారణమని భావించిన మాంతేష్, అతని తండ్రి నేరేడుగుంట దొడ్డయ్య కక్ష పెంచుకున్నారని జయలక్ష్మి అన్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రం తమ స్థలంలో ఉందని, ఖాళీ చేయాలని బెదిరించి, బయటకు తోసేశారని వాపోయారు. దీంతో మాజీ సర్పంచ్ పెద్ద నరసింహప్ప, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు, ఎంపీడీవో కార్యాలయ ఏవో శంకర్‌కు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 18: సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆ శాఖల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి తెలుసుకున్నారు. జిల్లాలో 103 ప్రభుత్వ శాఖలు ఉన్నాయని, ప్రతిశాఖ పోటీపడి పనిచేయాలని సూచించారు. శాఖల పరిధిలో ప్రగతి నివేదికలను రోజువారీగా పంపాలని ఆదేశించారు. రోజువారీ సమీక్షలతో మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సీజన్ లేనపుడు కూడా ఆయాశాఖలు నిల్ రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ఉన్నతాధికారులు అడిగినా, అడగకపోయినా జరగాల్సిన పని జరగాలని అన్నారు. జిల్లా అధికారి అంటే హోదా కాదని, అది బాధ్యత అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. నివేదికలు అందించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియ, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్.. కళ్యాణదుర్గానికి రండి..!



సీఎం చంద్రబాబుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం: బీటీపీ కాలువ పనుల పునఃప్రారంభానికి రావాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆహ్వానించారు. విజయవాడలో ఆయన సీఎంను గురువారం రాత్రి కలిశారు. నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని ఇచ్చారు. బీటీపీ కాలువ పనులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధి, నియోజకవర్గంలో తారురోడ్ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, రైతులకు సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని కోరారు.

ఒక్క రోజులో 7 టీఎంసీల చేరిక



టీబీ డ్యాంలోకి చేరిన వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 18: తుంగభద్ర జలాశయంలోకి వరదనీరు పరవళ్లు తొక్కుతూ చేరుతోంది. తుంగభద్ర జలాశయంలో గురువారం ఒక్కరోజే ఏడు టీఎంసీల నీరు చేరింది. తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో మరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయంలోకి ఒక్కరోజున ఏడు టీఎంసీల నీటి నిలువ పెరిగింది. గురువారం ఉదయం 46.80 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తుంగ నుంచి భారీ నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. మరింత పెరిగే అవకాశం ఉంది. గురువారం ఉదయం 82,491 క్యూసెక్కుల నీరు రాగా 1,04,060 క్యూసెక్కులకు అడుగుల నీటిమట్టంగాను 1614.31 అడుగులు ఉంది. అవుట్ ఫ్లో 300 క్యూసెక్కులు ఉంది. మరో రెండువారాల పాటు ఇదే తరహాలో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు డ్యామ్ అధికారులు అంటున్నారు. వచ్చేవారంలో జలాశయం పూర్తిగా నిండే పరిస్థితి వస్తుందని అధికారులు అన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే తల్లికి వందనం

ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం విద్య, జూలై 18 : 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ... తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు కూడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు లక్షలాది మంది విద్యార్థులు తరలి వెళతారని అన్నారు. ఇప్పటికే మూడేళ్ల నుంచి సుమారు 10 లక్షల మంది ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లారని అన్నారు. దీన్ని నివారించాలంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేయాలని కోరారు. అదే విధంగా జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన ఈ జీవో వల్ల 3,4,5 క్లాసులు విచ్ఛిన్నం అయ్యాయంటూ మండిపడ్డారు. తెలుగుమీడియం బోధన సైతం అన్ని పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్మీ మాజీ డాక్టర్ నారాయణప్ప మృతి

మాజీ సైనికుల నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 18: ఆర్మీ మాజీ డాక్టర్ నారాయణప్ప మృతికి మాజీ సైనికులు నివాళులర్పించారు. ఈ మేరకు మంగళవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో పలువురు మాజీ సైనికులు నగరంలోని నారాయణప్ప స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహానికి జాతీయ జెండాతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ ఆర్మీలో డాక్టర్‌గా నారాయణప్ప ఎన్నో సేవలందించారని కొనియాడారు. గాయపడిన సైనికులకు సకాలంలో చికిత్సలు అందించడంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. నివాళులర్పించిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, మణికుమార్, హుస్సేన్, పీరా, బీఏ హుస్సేన్, నరసింహులు, హరినాథ్, పెంచలయ్య, ఖాజామొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీల నియామకం



ప్రొఫెసర్ సుదర్శన రావు



ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, జూలై 18: జేఎన్‌టీయూ, ఎస్కేయూకి రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీలను నియమించింది. జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావును నియమించింది. ఆయన సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ బి.అనితను ప్రభుత్వం నియమించింది. ఆమె ఎంబీఏ విభాగం ప్రొఫెసర్. తదపరి ఉత్తర్వులు వచ్చేదాకా వీరు ఇన్‌చార్జి వీసీలుగా కొనసాగుతారు. ఈ నియామకాల్లో సీనియార్టీ, పారదర్శకతకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని వర్సిటీల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సిఫార్సులు, ప్రలోభాలకు తావులేకుండా వర్సిటీల పురోభివృద్ధిని దృష్టిలోపెట్టుకుని ఇన్‌చార్జి వీసీలను ప్రభుత్వం నియమించిందని అభినందించారు.

రెవెన్యూ తప్పిదాలు.. విద్యార్థులకు తిప్పలు

- ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో గందరగోళం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హతగా గుర్తింపు
- బీటెక్ ప్రవేశ విద్యార్థుల్లో ఆందోళన
- సవరణకు ప్రభుత్వం అవకాశం
- హెల్ప్‌లైన్ సెంటర్లలో మార్పునకు చర్యలు

అనంతపురం సెంట్రల్, జూలై 18: రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీస పరిశీలన లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో చాలామంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కోల్పోయారు. బీటెక్ కోర్సులు అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. ఇందుకు అర్హత సాధించాలంటే ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు జారీచేసే సచివాలయాల్లో దరఖాస్తుదారుల వివరాల నమోదులో క్రమపద్ధతిని పాటించలేదు. తండ్రికి బదులుగా విద్యార్థి పేరుతో ఇన్‌కమ్ సర్టిఫికెట్స్‌ను జారీ చేశారు. దీంతో ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో సర్టిఫికెట్లను తిరస్కరించారు. వెరసి అనేకమంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులుగా మిగిలిపోయారు. సీట్ అలాట్‌మెంట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్ నో అని రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసానిచ్చింది. మరోసారి ఆదాయ ధ్రువపత్రాలను సమర్పించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లను అందుబాటులో ఉంచింది.

ఇలా సరిదిద్దుకోవాలి..

ఆదాయ ధ్రువీకరణ ప్రతంలోని 'ఇన్‌కమ్ ఫ్రమ్ ఆల్ సోర్సెస్ ఆఫ్' అన్న తర్వాత తండ్రి పేరు ఉండాలి. ఆ తరువాత 'ఫాదర్ ఆఫ్, మదర్ ఆఫ్'గా విద్యార్థి పేరు ఉండాలి. అయితే తండ్రి ప్లేస్‌లో విద్యార్థి పేరు, విద్యార్థి ప్లేస్‌లో తండ్రి పేరును చేర్చడం ద్వారా విద్యార్థి ఆదాయం పొందుతున్నట్లు పత్రాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెట్‌కు సంబంధిత విద్యార్థులు రిజెక్ట్ అయ్యారు. విద్యార్థులు సచివాలయానికెళ్లి ఈ విషయాన్ని తెలియపరచి కొత్త ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి. అనంతరం జేఎన్‌టీయూ పరిపాలన భవనం, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించి సమర్పించాలి. అక్కడి అధికారులు సంబంధిత విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హులుగా నమోదు చేస్తారు.

కంగారు పడ్డా



నా కుమార్తెకు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు అలాట్ అయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని చెప్పడంతో కంగారు పడ్డాను. ఇలా ఎందుకని ఆరా తీస్తే.. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇచ్చాం. ఈ సర్టిఫికెట్స్‌లో పేర్లను తారుమారు చేశారు. నాపేరుకు బదులుగా నా కూతురు పేరు ఉందని చెప్పారు. దీంతో మళ్లీ సర్టిఫికెట్స్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇవ్వడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత వచ్చింది. ఇందుకు ప్రభుత్వం చొరవ మరువలేం.

-మురళి, విద్యార్థిని తండ్రి, పులివెందుల

సవరణకు అవకాశం



మాలాంటి పేదలందరికీ బీటెక్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ఇన్‌కమ్ సర్టిఫికెట్ సవరణ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కుమారుడికి ఎస్ఆర్ఐటీలో సీటు వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్‌లో అనర్హతగా తేల్చారు. ఇదేంటని అధికారులను ప్రశ్నించగా కౌన్సిలింగ్‌లో కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పుగా ఇచ్చివుంటారన్నారు. వెంటనే సచివాలయానికెళ్లి తప్పుల్లేని ఇన్‌కమ్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇచ్చాను. దీంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా ఆప్షన్ ఇచ్చారు.

-లాలెప్ప, విద్యార్థి తండ్రి, అనంతపురం

వయోజన బీసీజీ టీకాతో సురక్షితం



కదిరి అర్బన్, జూలై 18: క్షయ రహిత సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం, టీబీ ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్షయవ్యాధి నిర్మూలన కోసం బీసీజీ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టింది. టీకా సురక్షతమని, ఎటువంటి చెడు ప్రభావాలు లేవని, ప్రతి ఒకరూ తప్పకుండా ఈ టీకా వేయించుకొని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి టీకాలు వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 15 వరకు నిర్వహిస్తారు. ప్రతి గురు, సోమవారాల్లో టీకాలు వేస్తున్నారు.

ఈ లక్షణాలున్న వారికి తప్పనిసరి

ఈ లక్షణాలున్న ప్రతి ఒకరు బీసీజీ టీకాలు వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఐదేళ్లలో టీబీ వచ్చితగ్గిపోయినవారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలి. అలాగే 60 సంవత్సరాలు నిండిన, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎంఐ (శరీర ద్రవరాశి సూచిక, లేక ఎత్తుకు తగ్గిన బరువు) 18 కంటే తక్కువ ఉండేవారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలని సూచిస్తున్నారు.

వీరికి ఈ టీకా వద్దు

టీబీ వ్యాధి ఉండి, మందులు వాడుతున్నవారు, గర్భవతులు, పాలు ఇచ్చే తల్లులు, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు ఈ టీకా వేయించుకోరాదు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండనివారు... రక్తదానం చేసిన మూడు నెలల వరకు టీకా వేయించుకోరాదు.

క్షయవ్యాధి అంటే..

క్షయవ్యాధి.. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్‌క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అంటువ్యాధి, ఈ వ్యాధి స్త్రీ, పురుషులకు వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. ఈ వ్యాధి శరీరంలోని ఏ అవయవానికైనా రావచ్చు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఎక్కువగా సోకుతుంది. క్షయవ్యాధి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలిలో తుంపర్లుగా వెళ్లతాయి. వీటిని ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు ఈ వ్యాధి వారికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు, పుట్టిన పసిబిడ్డలకు బీసీజీ టీకాలు ఇప్పించాలి. క్షయ రోగి ఎక్కడబడితే అక్కడ ఉమ్మివేయరాదు. క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



క్షయవ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఈవ్యాధికి చిన్న, పెద్ద, స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరికి సోకుతుంది. భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బీసీజీ టీకా సురక్షితమైంది. క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దల్లో టీబీ నుంచి రక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. క్షయను నిర్మూలించేదుకు ప్రతి ఒకరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

పురం మున్సిపాలిటీలో

బిల్లుల కలకలం..!



మాజీ కమిషనర్‌పై చైర్‌పర్సన్ అవినీతి ఆరోపణలు

ఏసీబీకి ఫిర్యాదు... ఆలస్యంగా వెలుగులోకి..

హిందూపురం, జూలై 18: మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపు వ్యవహారం కలకలం రేపింది. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రమోద్‌కుమార్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డాడనీ, విచారణ చేపట్టాలని ఏసీబీకి చైర్‌పర్సన్ ఇంద్రజ ఫిర్యాదు చేయడం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా చెక్కుల రూపంలో కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారనీ, అందులో పర్సెంటేజీలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. కొన్ని పనులు చేయకుండానే బినామీ పేర్లతో బిల్లులు కాజేశారని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు వారం క్రితం ఏసీబీకి ఫిర్యాదు చేసిన విషయం గురువారం వెలుగు చూసింది. అందుకు సంబంధించిన కాపీలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లకు సీఎఫ్ఎంఎస్ నుంచి కాకుండా నేరుగా చెక్కులు ఇవ్వడం దుమారం రేపుతోంది.



రూ.కోట్లలో అక్రమాలు

మున్సిపల్ మాజీ కమిషనర్ ప్రమోద్‌కుమార్, అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న జేఏఓ మనోహర్ కుమ్మక్కై కొంత మంది కాంట్రాక్టర్లకు నేరుగా చెక్కులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు పనిచేస్తే వాటికి సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు చేయాలి. అలాకాకుండా తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు చెక్కులు రాసి ఇచ్చినట్లు చైర్‌పర్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా రూ.2కోట్ల వరకు చెక్కులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రతి బిల్లూ సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించాలని నిబంధనలున్నా.. ఇలా చెక్కుల రూపంలో ఇవ్వడం దారుణమని చైర్‌పర్సన్ ఆరోపించారు.

కలెక్టర్ ఆదేశించినా విచారణ శూన్యం

గతేడాది డిసెంబరులో మున్సిపాలిటీలో అక్రమాల వ్యవహారం అప్పటి కలెక్టర్ దృష్టికెళ్లగా.. సమగ్రంగా విచారణ చేయాలని మున్సిపల్ ఆర్డీకి ఆయన ఆదేశించారు. అయినప్పటికీ ఇంతవరకు విచారణ చేపట్టినట్లు దాఖలాలు లేవు.

చైర్‌పర్సన్ ఫిర్యాదుతో వెలుగులోకి..

అకౌంట్స్ విభాగంలో అవినీతి భారీఎత్తున జరిగిందని కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారనీ, దీనిపై లోతుగా విచారణ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఈనెల 9న ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. గతంలో పనిచేసిన కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తోపాటు ప్రస్తుతం అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మనోహర్ కలిసి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. ఏసీబీతోపాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌కు కూడా కొన్ని ఆధారాలు జతచేసి లేఖ పంపారు. చైర్‌పర్సన్ పంపిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పనులు చేయకపోయినా కొంతమంది కాంట్రాక్టర్లకు చెక్కులు ఇచ్చి, 20 నుంచి 30 శాతం కమీషన్ దండుకున్నట్లు చైర్‌పర్సన్ ఏసీబీకి పంపినలేఖలో పేర్కొన్నారు. ఈ అవినీతిపై లోతుగా విచారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ పరిణామం కాంట్రాక్టర్లలో కలకలం రేపింది. దీనిపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపడితే ఎంతమేర అవినీతి జరిగిందో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం

నార్పల, జూలై 18: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం శుక్రవారం ఉంటుందని ఈఓ శోభ గురువారం తెలిపారు. రాత్రి గంట పాటు ఆలయం బయట నుంచి కుళ్లాయి స్వామిని భక్తులకు చూపించి పెట్టెలో భద్రపరుస్తామన్నారు. శుక్రవారంతో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆమె తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 436 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.60

అనంతపురం రూరల్, జూలై 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.53, కనిష్ఠ ధర రూ.40 పలికినట్లు ఆయన తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి పట్టివేత

ఉరవకొండ, జూలై18: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ఉరవకొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గుత్తి మండలం టీ. కొత్తపల్లికి చెందిన నరేష్ గంజాయి కేసులో నిందితుడుగా ఉన్నాడు. అతడిని గుత్తి నుంచి విశాఖపట్నంకు గత మంగళవారం తీసుకెళ్తుండగా మార్కాపురం వద్ద తప్పించుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఉరవకొండలోని కణేకల్లు సర్కిల్‌లో గంజాయి అమ్ముతానంటూ కొంత మందికి చెప్తుండగా స్థానికులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సురేష్‌బాబు సిబ్బంది అంజి, సోము, కులశేఖర్ వెంటనే అక్కడకు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిని అనంతపురం పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఉద్యోగోన్నతులు

అనంతపురం రూరల్, జూలై 18: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోష్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని పలువురు అధికారులను టీఎస్ఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తిరిగి వారిని ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. ప్రస్తుతం సదరు అధికారులు తిరుపతి కార్పొరేట్ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఈ క్రమంలోనే వారికి ఉద్యోగోన్నతులు దక్కాయి. గతంలో జిల్లా ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈగా పనిచేసిన సంపత్‌కుమార్‌కు ఎస్ఈగా ఉద్యోగోన్నతి లభించింది. ఎస్ఏఓగా పనిచేసిన విజయ్‌భాస్కర్‌కు జీఎంగా, డీఈఈలుగా పనిచేస్తున్న డీఎస్ విజయ్‌రాజు, శివరాములు, వీఎం రవిశంకర్, ప్రసాద్‌కు ఈఈలుగా ఉద్యోగోన్నతి లభించింది. రెండు మూడురోజుల్లో వీరికి పోస్టింగులు ఇవ్వనున్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు



పరుగు తీస్తున్న ఎద్దులు

కొత్తచెరువు, జూలై 18: తొలిఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని పుట్టపర్తి, బుక్కపట్నం రహదారిలో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పరుగుపందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముందుగా కొత్తచెరువమ్మ ఆలయం వద్ద పూజలు చేసి, పోటీలు ప్రారంభించారు. ఒక్కో బండి పరుగులు పెడుతుంటే హాజరైన వారంతా కేకలు వేస్తూ, కేరింతలు కొడుతూ సంబరంగా గడిపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన బుచ్చయ్యగారిపల్లి రామాంజి ఎద్దులు విజేతగా నిలిచాయి. బీసీకాలనీకి చెందిన గౌడ్ ఎద్దులు రెండో, జానకంపల్లి వెంకటేశ్ ఎద్దులు మూడో బహుమతి గెలుచుకున్నాయి. విజేత ఎద్దులకు రూ.40వేలు, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు రూ.25వేలు, రూ.15వేలను చొప్పున సీఐ రాజారమేశ్, టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు అందజేశారు.

అటవీశాఖ పునర్విభజన

- మారనున్న జిల్లా అటవీ ముఖచిత్రం
- కొత్తగా ఒక రేంజ్, 5 సెక్షన్లు, 14 బీట్స్
- కసరత్తు ప్రారంభించిన యంత్రాంగం

అనంతపురం న్యూటౌన్, జూలై 18: జిల్లా అటవీశాఖ ముఖచిత్రం మారనుంది. ప్రస్తుతం ఉన్న మూడు రెంజ్‌లకు తోడు కొత్తగా తాడిపత్రి రేంజ్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది సెక్షన్స్‌కు అదనంగా మరో అయిదు సెక్షన్స్ ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 27 బీట్స్‌కు తోడు మరో 14 బీట్స్ ఎర్పడనున్నాయి. దీంతో మొత్తం బీట్స్ సంఖ్య 41కి చేరనుంది. ఈ విభజనకు అనుగుణంగా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

అడవులను కోల్పోయిన అనంత

ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, బుక్కపట్నం, కదిరి.. మొత్తం ఆరు రేంజ్‌లు ఉండేవి. జిల్లా విభజనతో శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి బుక్కపట్నం, పెనుకొండ, కదిరి రేంజ్‌లు వెళ్లాయి. ఎక్కువ అటవీ విస్తీర్ణం ఉన్న రేంజ్‌లు ఇవి. అనంతపురం జిల్లాలోని అనంతపురం, గుత్తి రేంజ్ పరిధిలో ఎక్కడా పెద్ద అడవులు లేవు. కళ్యాణదుర్గం రేంజ్‌లో మాత్రమే ఒక రకమైన అడవులు ఉన్నాయి. జిల్లా విభజన అనంతరం మరోసారి అటవీశాఖ బైఫరగేషన్ దిశగా చర్యలు తీసుకుంటోంది.

కొత్తగా తాడిపత్రి రేంజ్..

యాడికి బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. ఈ రెండింటిని తాడిపత్రి సెక్షన్‌గా చేశారు. ముచ్చుకోట, పుట్లూరు సెక్షన్స్‌తో కలిపి తాడిపత్రి రేంజ్ ఏర్పడనుంది. ఇందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెరగనుంది. అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె సెక్షన్‌లు ఉంటాయి.

కొత్త సెక్షన్స్ ఇలా..

అటవీశాఖ బైఫరగేషన్‌లో భాగంగా కొత్తగా 5 సెక్షన్స్ ఎర్పాటు కానున్నాయి. గార్లదిన్నె, ఉరవకొండ, శెట్టూరు, డి.హీరేహాళ్, తాడిపత్రి సెక్షన్స్ కొత్తగా ఏర్పడుతున్నాయి.

కొత్త బీట్స్ ఇవే..

కనంపల్లి, కలగల్లు, పంపనూరు, డి.హీరేహాళ్, ఆత్మకూరు, వెంకటాంపల్లి, కండ్లగూడూరు, అనుంపల్లి, గొల్లలదొడ్డి, దోసలేడు, ముద్దినాయనపల్లి, హొన్నూరు, గుమ్మఘట్ట.



జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయం

విభజన ఇలా..

శింగనమల బీట్‌ను రెండుగా విభజిస్తారు. శింగనమల, కనంపల్లి బీట్స్‌గా విడగొడుతున్నారు. మరుట్ల నార్త్, సౌత్ బీట్స్‌కు అదనంగా కలగల్లు బీట్ ఏర్పాటు చేస్తారు. ఆత్మకూరు, వడ్డుపల్లి బీట్స్‌కు తోడు పంపనూరు బీట్ ఏర్పాటు చేయనున్నారు. గుత్తి రేంజ్‌లోని రాయలచెరువు బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. కొత్తగా కండ్లగూడూరు బీట్ ఎర్పాటు కానుంది. యాడికిని రెండు బీట్స్‌గా విడగొడుతూ.. కొత్తగా కోన ఉప్పలపాడు బీట్ ఎర్పాటు చేస్తున్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీ పడకండి: ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 18: శాంతిభద్రతల పరిరక్షణలో రాజీప డవద్దని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి జిల్లాలోని డీఎస్పీలు, అదనపు ఎస్పీ లతో తన చాంబర్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని తాజా పరిస్థితులను సమీక్షించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల్లో భరోసా కలిగించడంలో దోహదం చేసే బేసిక్ పోలీసింగ్‌ను మెరుగుపరచుకోవాలన్నారు. బీట్లు రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తరచూ గ్రామాల సందర్శన చేయాలన్నారు. సమాచారం సేకరించి సమస్యలను మొగ్గ దశలో తుంచేయాలన్నారు. సిబ్బంది, అధికారులు అనే తేడా లేకుండా హోదా మరిచి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు ప్రతాప్, జనార్దన్‌నాయుడు, శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, మునిరాజ, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం టౌన్, జూలై 18: జిల్లాకు వచ్చిన నూతన ఎస్పీ కేవీ మురళీకృష్ణ గురువారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాద పూర్వకంగా కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌ను కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు కాసేపు జిల్లా పరిస్థితుల గురించి చర్చించారు.

27న అఖిలపక్ష సమావేశం

అనంతపురం టౌన్, జూలై 17: జిల్లాకేంద్రంలో రోగులకు అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు 27వ తేదీన అఖిల పక్షం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నేతలు తెలిపారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రాజమోహన్, కార్యదర్శులు రాజు, లాయర్ సత్యనారాయణరెడ్డి,రవీంద్రనాథ్‌రెడ్డి, సోమర రాహుల్, నాగమణి మాట్లాడుతూ వందకోట్లకుపైగా వ్య యం చేసి నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో సరైన వసతులు ఇప్పటికీ లేవన్నారు. సూపర్‌స్పెషాలిటీని జిల్లాప్రభుత్వ ఆస్పత్రి నుంచే నిధు లు, నిర్వహణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మేధా వి వర్గాలు పాల్గొని తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరారు.

మహిళా క్రికెట్ పోటీల్లో పలుజట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18: మహిళా క్రికెట్ పోటీలలో పలు జట్లు విజయం సాధించాయి. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కృష్ణా, నార్త్‌జోన్ జట్లు తలపడగా. కృష్ణా జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడగా సౌత్‌జోన్ గెలుపొందింది. చిత్తూరు, విశాఖపట్నం జట్లు పోటీ పడగా విశాఖపట్నం జట్టు గెలుపందింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధుఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సెమీస్‌కు మూడు జట్లు..

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18: స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మూడు జట్లు సెమీస్‌కు చేరాయి. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ జిల్లా స్థాయి స్కూల్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఉత్కంఠగా జరిగిన పోటీల్లో విజయం సాధించిన విన్సెంట్ డీపాల్, ఆర్డీటీ హైస్కూల్, వినయ్‌కుమార్ స్కూల్ జట్లు సెమీస్‌కు చేరాయి. కోచ్‌లు ప్రవీణ్, మధుసూదన్ నాయక్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు


ఢిల్లీరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రవికుమార్, ఇతర నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 18: వ్యవసాయ శాఖ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఢిల్లీరావుకు వ్యవసాయ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం విజయవాడలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో డైరెక్టర్ ఢిల్లీరావుకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఇతర నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆయనను కోరినట్లు వారు తెలిపారు.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం సెంట్రల్, జూలై 18: జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సత్యనారాయణ, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు క్రిష్ణయ్య, భానుమూర్తి, హెచ్‌ఓడీ అజిత.. వీసీని సత్కరించి, అభినందించారు.

జీజీహెచ్‌కు వైద్యపరికరాల వితరణ


సూపరింటెండెంట్‌కు వైద్యపరికరాలు అందజేస్తున్న దాతలు

అనంతపురం టౌన్, జూలై 18: జిల్లా సర్వజన ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు వైద్యచికిత్సలు అందించేందుకు ప్రవాసాంధ్ర వైద్యులు జగన్మోహన్‌రెడ్డి, లారెన్స్‌మోస్లీ, రోస్లిన్ బౌమెన్ తమ వంతు సాయంగా వైద్య పరికరాలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. రూ.26లక్షలు విలువ చేసే గుండెబాధితులకు అత్యవసరమైన స్టంట్స్, కిడ్నీబాధితులకు చికిత్స చేయడానికి అవసరమైన పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. దాతలను సూపరింటెండెంట్, ఇతర వైద్యులు అభినందించారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, ఆలంబన సంస్థ అధ్యక్షుడు జనార్దన్, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులకు ట్రైసైకిళ్ల పంపిణీ

చెన్నేకొత్తపల్లి, జూలై 18: మండలంలోని ఎన్ఎస్‌గేటు, సీకేపల్లి ప్రభుత్వాస్పత్రులకు గురువారం ట్రైసైకిళ్లను అందజేశారు. మండల పరిషత్‌కు ప్రభుత్వం సరఫరా చేసిన 10 ట్రైసైకిళ్లను ఆస్పత్రులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. వాటిని ఎంపీడీఓతోపాటు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర చేతులమీదుగా ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు.

ఘనంగా తొలి ఏకాదశి

చెన్నేకొత్తపల్లి, జూలై 18: మండలంలో తొలిఏకాదశి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సీకేపల్లి లక్ష్మీనరసింహస్వామి సన్నిధి, కనుమ వెంకటేశ్వరస్వామి కొండమీద లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో అహోబిల లక్ష్మీ నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండలంలోని యర్రజిన్నన్నగారిసమీపంలో కొండమీద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలిఏకాదవి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అజ్మీర్‌లో ప్రత్యేక ప్రార్థనలు


అజ్మీర్ దర్గాలో టీడీపీ మైనార్టీ నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 18: రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతోపాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్, నజీర్, మహబూబ్ బాషా, జిలాన్ దువా చేసి మొక్కు తీర్చుకున్నారు.

వైసీపీ హయాంలో అవినీతిని బయటకు తీస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


కలెక్టర్‌ను కలిసి బయటకు వస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం టౌన్/అర్బన్, జూలై 18: అనంతపురం అర్బన్‌లో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేయించి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత అర్బన్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆయన ఫిర్యాదు చేశారు. 50 సెంట్ల భూమి విషయంలో వివాదంతో ఎన్టీఆర్‌మార్గ్ రోడ్డు నిరుపయోగంగా మారిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సంబంధించిన భూమి యజమానులకు పరిహారం అందించి రోడ్డును పూర్తి చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని వివరించారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. 7 ఎకరాల్లో ఉండాల్సిన సెంట్రల్ పార్క్ ప్రస్తుతం మూడున్నర ఎకరాల్లో మాత్రమే ఉందన్నారు. మిగతా భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ చేయించాలన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ.. జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని వెలికితీస్తామన్నారు. త్వరలో ఎన్టీఆర్ మార్గ్‌లో వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

గాయపడిన టీడీపీ నాయకుడికి పరామర్శ: నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పరామర్శించారు. గురువారం రాత్రి స్థానిక బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.


వీరాంజనేయులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

జనసేన సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్దాం

● సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై18: జనసేన పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్రప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరుణ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పదిరోజుల పాటు నిర్వహించే సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొనాలన్నారు. 28వతేదీ వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు డ్రైవ్ నిర్వహించాలన్నారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబు రావు, జిల్లా ఉపాధ్యక్షులు జయరామిరెడ్డి, అంకె ఈశ్వరయ్య, లీగల్ సెల్ మురళీకృష్ణ, కాయగూరల లక్ష్మీపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, గ్రంధి దివాకర్, మేదర వెంకటేష్, రొళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ నేతల చేరిక: వైసీపీకి చెందిన పలువురు నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఆధ్వర్యంలో వారు పార్టీలోకి చేరారు. కళ్యాణదుర్గం, కంబదూరు మండలానికి చెందిన వైసీపీ నాయకులు, మద్దతుదారులు 30 మందికిపైగా జనసేనలోకి చేరారు. వీరందరికి జిల్లా అధ్యక్షుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


సభ్యత్వ నమోదు ప్రక్రియను సెల్‌ఫోన్ ద్వారా చూపుతున్న జనసేన నాయకులు

శింగనమల: జనసేన పార్టీ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట ఓబిలేసు, జిల్లా కార్యదర్శి బొమ్మన పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని రామస్వామి దేవాలయంలో సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని నిర్వహించారు. సాయిశంకర్, తోట ప్రవీణ్‌కుమార్, గజేంద్ర, శ్రీకాంత్, రామాంజి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు బోల్తా

● విద్యార్థికి తీవ్రగాయాలు
● మద్యం సేవించి బస్సు నడిపిన డ్రైవర్


యర్రగుంట సమీపంలో బోల్తా పడిన బస్సు

రాప్తాడు, జూలై 18: డ్రైవర్ మద్యం మత్తు కారణంగా ప్రైవేటు పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. రాప్తాడు మండలం యర్రగుంట క్రాస్ వద్ద బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలోకి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ విద్యార్థులకు ప్రాణాపాయం తప్పింది. ఒక విద్యార్థి తీవ్రంగా, ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడు. అనంతపురం నగరంలోని చంద్రబాబు కొట్టాల సమీపంలోని వికాస్‌నగర్‌లో ఉన్న ఎస్ఆర్‌కే పాఠశాలకు రాప్తాడు మండలం మరూరు, ఎం. చెర్లోపల్లి, క్రిష్టాపురం గ్రామాల నుంచి సుమారు 80 విద్యార్థులు వెళుతుంటారు. వీరిని రోజూ అదేపాఠశాల బస్సు ఉదయం తీసుకెళ్లి.. సాయంత్రం దిగబెడుతుంటారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పాఠశాల నుంచి విద్యార్థులను ఇళ్లకు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ కృష్ణమూర్తి తాగిన మైకంలో బస్సు నడపడంతో యర్రగుంట క్రాస్ వద్ద అదుపు తప్పింది. రోడ్డు పక్కన వేపచెట్టును ఢీకొట్టి.. బోల్తా పడింది. సమీప పొలాల్లో పని చేస్తున్న రైతులు, కూలీలు గమనించి.. పరుగున వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ఇదే అదనుగా డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ప్రమాదంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సులో ఇరుక్కుపోయి.. ఏడుస్తున్న చిన్నారులను రైతులు, కూలీలు బయటకు తీసుకువచ్చి ధైర్యం చెప్పారు. విషయం తెలుసుకున్న యర్రగుంట, బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు, మరూరు, చెర్లోపల్లి, క్రిష్టాపురం గ్రామాల విద్యార్థుల తల్లితండ్రులు వందల సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రెండు అంబులెన్సులు ప్రమాదస్థలానికి వచ్చాయి. గాయపడ్డ విద్యార్థులను, క్లీనర్‌ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన విద్యార్థులకు అంబులెన్స్‌లోనే ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపారు. రాప్తాడు పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో బస్సును నిలబెట్టారు. ప్రమాద స్థలంలో రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టు విద్యార్థుల ప్రాణాలను కాపాడింది. వేగంగా వెళుతున్న బస్సు అదుపుతప్పినా.. చెట్టు అడ్డురావడంతో ఢీకొట్టి ఒకవైపు ఒరిగిపోయింది. లేదంటే మరోసారి పల్టీకొట్టేదని, ప్రమాద తీవ్రత పెరిగేదని అక్కడున్న వారు అన్నారు.

టోల్ గేట్ తప్పించాలని..


గాయపడిన చిన్నారులు

మరూరు, చెర్లోపల్లి, క్రిష్టాపురం గ్రామాల విద్యార్థులను తరలించే బడి బస్సు.. జాతీయ రహదారి మీదుగా మరూరు టోల్‌గేట్, గొళ్లపల్లి, హంపాపురం, రామినేపల్లి, రాప్తాడు మీదుగా ప్రయాణించే వీలుంది. కానీ రోజుకు రెండుసార్లు టోల్ గేటు దాటాల్సి ఉంటుంది. టోల్ గేటు ఫీజు లేకుండా.. బండమీదపల్లి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి రామినేపల్లి మీదుగా బస్సును అనంతపురం వరకూ నడుపుతున్నారు. దీనికితోడు తాగుడుకు బానిసైన వ్యక్తిని బస్సు డ్రైవర్‌గా నియమించుకున్నారు. అధికారులు విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి వెళ్లిన రైతులు, కూలీలు డ్రైవర్‌ను పరిశీలించారు. అప్పటికీ అతడికి మద్యం మత్తు దిగలేదని, తూలుతూ కనిపించాడని తెలిపారు.

డ్రైవర్ల సమస్యలపై సిక్కిం సీఎంకు వినతి

అనంతపురం క్రైం,జూలై 18: డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్‌ను జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో ఆలిండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ పేరుతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లో అనేక డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమావేశానికి హాజరైన సీఎం దృష్టికి ప్రభుత్వ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు సందీప్‌శౌర్య తీసుకెళ్లారు. సీఎం స్పందిస్తూ ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంసాని శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

బుక్కరాయసముద్రం, జూలై 18: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా రెండు మొక్కలు నాటాలని జిల్లాపరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హరిత అనంత కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. ఎంపీడీఓ శోభారాణి, ఎంపీపీ సునీత, ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

ముగిసిన మొహరం

గార్లదిన్నె, జూలై 18: మొహరం వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. గార్లదిన్నె, మర్తాడు, ముంటిమడుగు, కల్లూరు తదితర గ్రామాల్లో వారం రోజుల నుంచి మొహరం వేడుకలను ఎంతో భక్తి శ్రద్ధలతో ఎంతో వైభవంగా నిర్వహించారు. గురువారం జలధి కార్యక్రమం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పీర్లస్వాములను దర్శించుకున్నారు. సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం నిర్వహించడంతో గార్లదిన్నెతోపాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో గార్లదిన్నెకు చేరుకున్నారు. పీర్ల స్వాముల అగ్నిగుండ ప్రవేశాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.


జూలాకాలువలో జలధికి వెళ్తున్న పీర్లు


గార్లదిన్నెలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు

శింగనమల: మండలంలో పలు గ్రామాల్లో గురువారం పీర్లస్వాములు జలధికి తరలాయి. మండలంలోని జూలాకాలువ, చిన్నజలాలపురం, గురుగుంట్ల, నిదనవాడ, ఆనందరావుపేట తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి పీర్ల మకానం వద్ద అగ్నిగుండాలు వెలగించి తెల్లవారు జామున, సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. గురువారం రాత్రి పీర్లు జలధికి తరలించారు.

పీర్లు చావిడికి దండు విరాళం: మండలంలోని తరిమెల పీర్ల చావిడికు తెలుగుయవత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు విరాళం అందజేశారు. తరిమెల గ్రామానికి చెందిన రెడ్డి చావిడికి రూ.5వేలు టెక్కే చావిడికి రూ.5వేలు, అనంతపురం వేణుగోపాల్ నగర్‌లోని షిర్డీసాయి మందిరానికి గురుపౌర్ణమికి రూ.10వేలు విరాళం అందజేశారు.

స్ఫూర్తిప్రదాత.. వీకే ఆదినారాయణ రెడ్డి

అనంతపురం విద్య, జూలై 18: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు వీకే ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తిదాయకుడని సీపీఐ నాయకులు కొనియాడారు. గురువారం ఆయన 27వ వర్ధంతిని ఘనంగా చేశారు. నగరంలోని మహదేవ్‌నగర్‌లో ఆయన స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి జాఫర్, నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. సీపీఐ శ్రేణులకు ఆదినారాయణ రెడ్డి మార్గదర్శకులన్నారు. నాయకులు సూర్యనారాయణరెడ్డి, కమిర్ బేగం, రాజారెడ్డి, లింగమయ్య రమణ, సంతోష్ కుమార్, రాజేష్ గౌడ్, అల్లిపీరా, ఆనంద్‌కుమార్, ఈశ్వరయ్య, రామయ్య పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుల ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ రిటైర్డ్ ప్రిన్సిపాల్, వీకే రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గోవిందరాజులు, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతయ్య, రామ్మోహన్, లీలాధర్ ప్రసాద్, నాగరాజు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: పేదలు, కష్టజీవుల కోసం కమ్యూనిస్టు పార్టీ తరుపున పోరాటం చేసిన వ్యక్తి ఆదినారాయణరెడ్డి అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున అన్నారు. గురువారం మండలంలోని ఆకుతోటపల్లి వద్దనున్న సమతా గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు వీకే ఆదినారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, రూరల్ మండల కార్యదర్శి రమేష్, నియోజకవర్గం నాయకులు దుర్గాప్రసాద్, నగేష్, ఓబులేసు, మన్నీల వెంకటరాముడు, శ్యామ్, హుస్సేన్ పీరా, వెంకటరాముడు పాల్గొన్నారు.


వీకే ఆదినారాయణరెడ్డి స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నారాయణపురాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేస్తాం


పీర్ల మకాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, జూలై 18: మండలంలోని నారాయణపురం పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేస్తామని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌లో పీర్ల మకాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నారాయణపురం చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మెజార్టీ తనకు ఇచ్చారని ఎమ్మెల్యే అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్ మురళి, బీసీసెల్ నాయకులు జోగి రాజేంద్ర, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, రాష్ట్ర నాయకులు దండు శ్రీనివాసులు, ఈశ్వర్, రమణ, లాల్‌స్వామి, అనిల్, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతు ఉద్యమ హామీలు మోదీ నెరవేర్చాలి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం విద్య, జూలై 18: రైతు ఉద్యమ సమయంలో 2020-21లో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను తక్షణం అమయ్యేలా చూడాలని ఏపీ రైతు సంఘం నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిరుతల మల్లికార్జున ఎంపీని కలిసి సమస్యను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నాన్చుడి ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఈ మేరకు ఎంపీకి వినతిపత్రం అందించారు. నాయకులు చెన్నప్ప యాదవ్, రామకృష్ణ, రాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలూరి నారాయణప్పకు నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూలై 18: నగరంలోని కమలానగర్‌లో ఉన్న తాతా క్లినిక్ వైద్యుడు వేలూరి నారాయణప్ప (80) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ గురువారం స్థానిక జేఎన్ఎస్ నగర్‌లోని సోఫియా నెస్ట్ అపార్ట్‌మెంట్‌కు చేరుకొని వేలూరి నారాయణప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీలపై దాడిచేసిన వారిని శిక్షించాలి


హోంమంత్రి అనితను కలిసిన నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ ఎస్టీలపై జరిగిన దాడులు, హత్యలపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. గురువారం రాజధాని అమరావతిలో హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులైన డాక్టర్ సుధాకర్, పశుసంవర్థక శాఖ డీడీ అచ్చన్న, న్యాయాధికారి రామకృష్ణ, డ్రైవర్ సుబ్రహ్మణ్యంలతో పాటు ఎంతో మంది హత్యలకు కారకులైన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి, బాధ్యులను శిక్షిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూలై 18: కేబుల్ వైర్ల ఏర్పాటు క్రమంలో మండలంలోని పాపంపేట పంచాయతీకి నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో నీరు వృథాగా పోతున్నాయి. దీనిపై స్పందించిన టీడీపీ నాయకులు పంచాయతీ సిబ్బందితో మరమ్మతు పనులు చేయించారు. నాయకులు రామాంజనేయులు, బాబావలి, సాంబశివ, శ్యామ్, మద్దినేనికృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

రాప్తాడు, జూలై 18: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ్ నగర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పరిటాల రవీంద్ర కాలనీలో తాగునీటి కోసం ఎమ్మెల్యే పరిటాల సునీత టీడీపీ నాయకుల ద్వారా తాగునీటి బోరు వేయించారు. కన్వీనర్ కొండప్ప, మాజీ ఎంపీటీసీ శేఖర్, సర్పంచులు తిరుపాలు, శశికళ, ఈశ్వరయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

21న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

అనంతపురం కల్చరల్, జూలై 18: అఖిలభారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం ఆధ్వర్యంలో 21వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లాకేంద్రంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మాచిరాజు కిరణ్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తిగల బ్రాహ్మణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9494067590 నంబరును సంప్రదించవచ్చునన్నారు.

బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎమ్మెల్యే ధన్యవాదాలు

శింగనమల, జూలై 18: నియోజకవర్గంలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహోత్సవాలు విజయవంతంపై అన్ని శాఖల అధికారులు, భక్తులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ధన్యవాదాలు తెలిపారు. 10 రోజుల పాటు గూగూడు కుళ్లాయి స్వామి వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు, కలగకుండా విధులు నిర్వహించిన కలెక్టర్, పోలీసులు, ఆర్డీఓ, దేవదాయ శాఖ అధికారులకు, భక్తులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒకరికి ధన్యవాదాలు తెలిపారు.

కదిలిన యంత్రాంగం..!

● కక్కలపల్లి గ్రామ సర్వే నంబరు 14-2 పరిశీలన


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం రూరల్, జూలై 18: అనధికార లేఅవుట్‌పై జిల్లా యంత్రాంగం కదిలింది. ఆ మేరకు గురువారం జిల్లా పంచాయతీ, రిజిస్ట్రేషన్, అహుడా శాఖల అధికారులు లేఅవుట్‌ను పరిశీలించారు. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ కక్కలపల్లి గ్రామ సర్వే నెంబరు 14-2లోని 6.80ఎకరాల్లో వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పంచాయతీ, అహుడా అనుమతులు లేకుండా లేఅవుట్ వేసిన విషయం తెలిసిందే. ఇదేక్రమంలో నాయకులు రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కై కొన్ని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. పంచాయతీ, అహుడా అధికారులు నోటీసులు, అనాధికార లేఅవుట్ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వాటిని తొలగించి లేఅవుట్‌లో వివిధ పనులు వైసీపీ నేతలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో అనాధికార లేఅవుట్‌పై కథనాలు వెలువెడ్డాయి. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులకు పూర్తి విచారణకు కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, రిజిస్ట్రార్ భార్గవ్, అహుడా వైస్‌ఛైర్మన్ మురళీ కృష్ణ తదితరులు అనాధికార లేఅవుట్‌ను పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ లేఅవుట్‌దారులు ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసినట్లు తెలిపారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్‌కు స్థానిక పరిస్థితిని వివరిస్తూ నివేదిస్తామన్నారు.

చంద్రబాబు పాలన భేష్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, జూలై 18: అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన మార్కు పరిపాలనతో మెప్పిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పరిపాలనకు, మాజీ సీఎం జగన్ పాలనకు భూమికీ ఆకాశానికీ ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబు పాలనలో నెల రోజుల్లోనే రాష్ట్రంలో ఎంతో మార్పును చూస్తున్నామన్నారు. ఉచిత ఇసుక, పింఛన్ల పెంపు, ప్రజా వేదికలో జనం ఫిర్యాదులను స్వీకరించడం, కాన్వాయ్‌ను ఆపి మరీ వినతులను తీసుకోవడం తదితర చర్యలతో చంద్రబాబు తన పాలన తీరును చాటుకున్నారన్నారు. పవన్‌కల్యాణ్ కూడా పంచాయతీల అభివృద్ధిపై దృష్టిపెట్టడం సంతోషకరమన్నారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు పరదాల ముఖ్యమంత్రిగా పేరుపొంది, కేవలం తాడేపల్లికి పరిమితమయ్యారని దుయ్యబట్టారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు బీ గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

14మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి, జూలై 18: పట్టణ సమీపంలోని బిందెలకాలనీలో గురువారం 14మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.46120 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామని, పేకాట ఆడుతున్న వెంకటరామిరెడ్డి, పెద్దనారాయణరెడ్డి, రవిచంద్రారెడ్డి, రంగనాయకులు తోపాటు మరో 10మందిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నేడు ఎమ్మెల్యే ప్రమాణం

తాడిపత్రి, జూలై 18: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారని మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ గురువారం ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రమాణం చేస్తారని చెప్పారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, జూలై 18: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు, పరశురాం గురువారం ఘర్షణపడి గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రెండురోజులక్రితం రామాంజనేయులు, పరశురాం ఓ విషయంలో మాటమాట పెరిగి గొడవపడే వరకు వెళ్లారు. అయితే గురువారం మరోసారి ఇరువురు ఎదురుపడి కొట్టుకున్నారు. ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్, జూలై 18: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠకులకు ఇబ్బంది కలుగుతోందని, గ్రంథాలయానికి ప్రత్యామ్నాయ భవనం చూపాలని ఎంపీడీఓ రఘునాథ్‌ను ఆమె కోరారు. గ్రంథాలయ అధికారి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

యాదవ సంఘం కమిటీ ఎన్నిక

రాయదుర్గం, జూలై 18: యాదవ సంఘం పట్టణ నూతన కమిటీని స్థానిక సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రామ్మూర్తిస్వామి, బీఎన్ తిప్పేస్వామి, అగ్రహారం రామాంజినేయులు, మోపూరి చంద్రశేఖర్, మామిళ్ల కృష్ణప్రసాద్, జీఎన్ నరసింహులు, దాసరి తిమ్మప్ప, ఎన్ఎండీసీ చిక్కణ్ణ, ఏటూరి రామాంజినేయులు నక్కా విరూపాక్షి, మోపూరి వసంతరాజు, మేకల శ్రీనివాసులు, లాయర్ లోకానంద, అధ్యక్షుడిగా బంగి ఉమాశంకర్,ఉపాధ్యక్షులుగా రామస్వామి, జక్కల భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మీనారాయణబాబు, మోపూరి రాజేష్, కోశాధికారిగా మూలింటి నాగరాజు, ఉప కోశాధికారిగా బత్తుల లోకేష్, ప్రచార కార్యదర్శులుగా ఆవుల మనోహర్, శిరివాళం ప్రసాద్, మోపూరి శ్రీకాంత్, అగ్రహారం కిరణ్, బంగి రమేష్, తరూరు జగదీష్ ఎన్నికయ్యారు.

చెస్‌టోర్నీ పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరుజయరాం

గుంతకల్లుటౌన్,జూలై18: పట్టణంలో గురువారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు గుమ్మనూర్ ఈశ్వర్ చెస్ టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెస్‌టోర్నమెంట్ నిర్వాహకుడు నాగార్జున మాట్లాడుతూ స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో ఈనెల 20న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెస్ టోర్నీ జరగనుందన్నారు. పాల్గొనే వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.



గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది



కళ్యాణదుర్గంలో..

హెల్మెట్ తప్పక ధరించాలి

● ద్విచక్రవాహనదారులకు న్యాయాధికారుల సూచన

● పలుచోట్ల న్యాయవాదులతో కలిసి అవగాహన ర్యాలీలు

గుంతకల్లుటౌన్,జూలై18: ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యునుస్ సూచించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమంటూ మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు నుంచి రామలింగ కాంప్లెక్స్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా యూనుస్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం సురక్షితమన్నారు. కనుక ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి సురేష్, న్యాయవాదులు నాగేశ్వర, జయరాం, తిమ్మారెడ్డి, తిమ్మప్ప, ధనుంజయ, కోర్టు సూపరింటెండెంట్ కిరణ్, కసాపురం ఎస్ఐ దుగ్గిరెడ్డి, ప్యారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించేందుకు మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి , న్యాయవాదులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ, కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, న్యాయవాదులు మనోహర్‌బాబు, రసూల్, గంగాధర్‌కుమార్, జయరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి బండే సుభాన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. బళ్లారి మిట్ట నుంచి టీ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. అప్పుడే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గా కల్యాణి, న్యాయవాదులు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణం నుంచి టవర్ క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేంద్ర ప్రసాద్‌బాబు, రామ్మోహన్, దామోదర్ నాయుడు జయరాజ్, తుకారాం పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలో మండల లీగల్ కమిటీ అసోసియేషన్ కమిటీ అధ్యక్షురాలు శోభారాణి , బార్ అసోసియేషన్ సభ్యులు హెల్మెట్‌ల వాడకంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు లోకానంద, హెడ్ కానిస్టేబుల్ మురళిబాలు తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

● ముగిసిన మొహరం ఉత్సవాలు



గొట్కూరు, కణేకల్లులో జలధికి వెళ్తున్న పీర్లు

కూడేరు, జూలై 18: మండలంలోని గొట్కూరులో గురువారం మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం పీర్ల స్వాములను ముజావర్లు అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అలాగే గ్రామంలో ఊరేగింపు చేశారు. తర్వాత సాయంత్రం మరోసారి అగ్నిగుండ ప్రవేశం చేయించి సమీపంలోని బావి వద్దకు జలధికి తరలించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి. పెద్దఎత్తున భక్తులు వేడుకలో పాల్గొన్నారు.

గుత్తిరూరల్: మండలంలోని గొందిపల్లి, గాజులపల్లి, జక్కలచెరువు, ఇసురాళ్లపలి, బేతాపల్లి, తదితర గ్రామాలలో పీర్లు జలధికి వెళ్లాయి. తొలుత అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు.

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లి గ్రామంలో పీర్లు జలధికి తరలివెళ్లాయి. ఉదయం అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం జలధికి తీసుకెళ్లారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి, పెద్దపొలమడ, అయ్యవారిపల్లి, తిమ్మాపురం, వంగనూరు గ్రామాల్లో పీర్లు జలధికి తరలివెళ్లాయి. తొలుత అగ్నిగుండ ప్రవేశం చేయించి పురవీధుల్లో ఊరేగించారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద వెలసిన కాలబాయి పీర్లు జలధికి వెళ్లాయి. ముందుగా స్థానిక పాత పోలీస్‌స్టేషన్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ఊరేగించారు. అనంతరం చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్దకు జలధికి తరలించారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌తో పాటు కృష్ణాపురం, గోనేహాళ్, కొళగానహళ్లి గ్రామాలలో పీర్లు జలధికి వెళాయి. వేకువజామున పీర్లను అగ్రిగుండ ప్రవేశం చేయించి గ్రామాల వీధులలో ఊరేగించారు. సాయంత్రం జలధికి తరలించారు.

పానకాల వేడుకలు

గుమ్మఘట్ట: మండలంలోని గలగల, కలుగోడు గ్రామాల్లో వన్నూరుస్వామి పీర్ల పానకాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పీర్లను దర్శించుకుని బెల్లం, చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి అగ్నిగుండం వెలగించి ఆలాయ్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జలధికి తరలించనున్నట్లు ముజావర్లు తెలిపారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన బీరప్ప పూజారులు



మంత్రికి వినతి పత్రాన్ని ఇస్తున్న పూజారులు

ఉరవకొండ,జూలై18: రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను బీరప్ప పూజారులు గురువారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 87గుడికట్టు ఉన్నాయని, ఒక్కొక్క గుడికట్టుకు ఇద్దరు పూజారులు చొప్పున 174మంది ఉన్నారని, అందరికీ ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.10వేలు చొప్పున జీతభత్యాలు ఇవ్వాలని కోరారు.

కర్బూజ పొలాల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన



ములకనూరులో రైతుతో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి రత్నకుమార్

కళ్యాణదుర్గం, జూలై 18 : ఊజీ ఈగతో కర్బూజ పంటంతా నాశనం అవుతుండడంపై ఆంధ్రజ్యోతిలో గురువారం కన్నీటి కర్బూజ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉద్యానశాఖాధికారులు వెంటనే స్పందించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి ఫిరోజ్ ఖాన్ ఆదేశాల మేరకు ఉరవకొండ ఉద్యానశాఖాధికారి నెట్టికంటయ్య, రాప్తాడు ఉద్యానశాఖాధికారి రత్నకుమార్ తదితరులు బృందంగా ఏర్పడి కర్బూజ పంట పొలాలను సందర్శించారు. కంబదూరు మండలం గుద్దెళ్ల, ములకనూరు గ్రామాల్లో పొలాలను సందర్శించి అక్కడి రైతులకు ఊజీ ఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎకరా పొలంలో లింగాకర్షక బుట్టలను అమర్చుకోవలెనని తెలిపారు. ఎకరాకు 4 నుంచి 8 బుట్టల వరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పొలంలో పసుపు రంగు ఆకారంలో ఉన్న అట్టలను ఏర్పాటు చేయడం ద్వారా కూడా పెద్ద పురుగులకు ఆకర్షించవచ్చునన్నారు. నీమ్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 2 నుంచి 3 ఎంఎల్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొదటి దశలోనే ఊజీ ఈగను గుర్తించి, తద్వారా జాగ్రత్తలు పాటిస్తే నివారించేందుకు సాధ్యం అవుతుందని వారు పేర్కొన్నారు.

కిరాణాషాపుల్లో నామమాత్రపు తనిఖీలు

పుట్లూరు, జూలై18: కిరాణాషాపుల్లో ఎంత ధరలకు అమ్ముతున్నా చూసిచూడనట్లు ఉండాలనుకున్నారేమో ఆ అధికారులు. ఎంత ధరలకు అమ్ముతున్నా రాజకీయ నాయకుల నుంచి ఫోన్‌వస్తే చాలు నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మండలకేంద్రంలో ఓ కిరాణాషాపులో గురువారం అధిక ధరలకు సరుకులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో మండలస్థాయి అధికారులు తనిఖీకి వెళ్లారు. తనిఖీలు చేయగా అక్కడ రెండు వస్తువులే ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలని మిగతా సరుకులు ఎంతకైనా విక్రయించుకోవచ్చునని తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై తహశీల్దార్ మల్లికార్జునస్వామిని వివరణ కోరగా అలాంటిదేమి లేదు చక్కెర, కందిపప్పు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలని తెలిపారు.

కుష్టుపై అవగాహన ర్యాలీ

బొమ్మనహాళ్, జూలై 18: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గురువారం బొమ్మనహాళ్ హెల్త్ అసిస్టెంట్లు జైనబీ, గోవర్ధన్ కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో తిరుగుతూ కుష్టు ఏ విధంగా వస్తుంది, దాని లక్షణాలు ఎలా ఉంటాయో వివరించారు. అనంతరం వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించడానికి సర్వే నిర్వహించారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది కుష్టుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. వైద్యుడు బాలాజీనాయక్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కార్తీక్‌రెడ్డి , సిబ్బంది కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడానికి ఆగస్టు 2వ తేదీ వరకు సిబ్బంది ఇంటింటి సర్వే చేయనున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంరూరల్, జూలై 18: పట్టణంలోని శాంతినగర్‌లో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ వారు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, వెండి కవచధారణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత 8 గంటల నుంచి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి బళ్లారి బస్టాండ్, వినాయకసర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ ప్రాంతాల్లో ఊరేగింపు సాగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆయన ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో కొలువుదీర్చారు.

అక్రమ కేసులను ఎత్తేయండి: అమిలినేని



హోం మంత్రిని సత్కరించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూలై18: వైసీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విన్నవించారు. విజయవాడలో గురువారం హోం మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ హయాంలో అక్రమ కేసులు పెట్టారని, వాటిని తొలగించేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో పోలీసు సిబ్బంది కొరత లేకుండా చూడాల కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేసి సహకరించాలని మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విన్నవించారు. విజయవాడలో గురువారం ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధిలో పూర్తిగా వెనకబడిందన్నారు. ప్రస్తుతం అవసరమైన నిధులను విడుదల చేసి అభివృద్ధికి సహరించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తాగునీటి కోసం ఆందోళన.. పరిష్కరించిన టీడీపీ



రాస్తారోకో చేస్తున్న మహిళలు

విడపనకల్లు, జూలై 18: తమ కాలనీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తే మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా ఉన్న సుబ్బలక్ష్మి కాలనీ, రసూలమ్మ కాలనీ మహిళలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రోడ్డుపైకి ఖాళీబిందెలతో వచ్చి బైఠాయించారు. పలువురు మాట్లాడుతూ.. తమ కాలనీలకు 40 రోజులైనా తాగు నీరు రావటం లేదన్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇన్ని రోజులు తాగు నీరు లేకపోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారుల వద్దకు వచ్చి చర్చించారు. తాగు నీరు అందించే ఏర్పాట్లు చేస్తామమని, రాస్తా రోకో విరమించాలని కోరారు. తాగునీరు ఇచ్చే వరకూ వెళ్లేది లేదని వారు భీష్మించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి గంటలోపే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. టీడీపీ నాయకులు కలిగించుకుని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో చర్చించి అర గంటలోనే ఆ రెండు కాలనీలకు తాగు నీరు అందించారు.

బాల్య వివాహాలను అరికడదాం: సీడీపీఓ

యల్లనూరు, జూలై18: బాల్య వివాహాలను అరికడదామని, ఇందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఐసీడీఎస్ సీడీపీఓ భారతి పిలుపునిచ్చా రు. మండలకేంద్రంలోని కేజీబీవీలో గురువారం బాలల హక్కులు, చ ట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. చిన్నవయస్సులోనే గర్భం దాల్చడం వల్ల అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. మానసిక రుగ్మతలకు లోనవుతారన్నారు. కనుక ఎవరూ కూడా బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని తెలిపారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్, డిప్యూటీ తహసీల్దార్ శ్వే త ,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధారమణి, ఏపీఎం ముత్యాలప్ప, ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

23నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

పుట్లూరు, జూలై18: మండలవ్యాప్తంగా ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం ప్రకటనలో తెలిపారు. 23న పుట్లూరు, 24న కుమ్మనమల, 25న కోమటికుంట్ల, 26,27వ తేదీల్లో కడవకల్లు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

అగ్ని గుండంలో పడి ఒకరికి గాయాలు

తాడిపత్రి, జూలై18: మండలంలోని యర్రగుంటపల్లిలో గురువారం జరిగిన జలధి కార్యక్రమంలో సూర్యప్రకాష్ అగ్ని గుండంలో పడి గాయపడ్డాడని రూరల్ పోలీసులు తెలిపారు. అతను పీరును ఎత్తుకొని అగ్నిగుండ ప్రవేశం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు పడిపోయాడని, దీంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని తెలిపారు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

వీకే ఆదినారాయణరెడ్డికి ఘన నివాళి



యాడికిలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ, జూలై18: కమ్యూనిస్టు నాయకుడు వీకే ఆదినారాయణరెడ్డి వర్ధంతిని పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక సీపీఐ నాయకు లు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ వీకే ఆదినారాయణ రెడ్డి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ జిల్లాలో సీపీఐ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అనంతపురం జిల్లాను కరువు కోరల నుంచి కాపాడడానికి పలు ఉద్యమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకుడు సుల్తాన్, తోపుడు బండ్ల సంఘం నాయకులు చక్రధర్, గంగాధర్ చెన్నరాయుడు, పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు , నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి ఆ పార్టీ పట్టణ కార్యదర్శి రాజు, మండల కార్యదర్శి రామదాసు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వీకే ఆదినారాయణరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి వెంకటరాముడు, మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ, సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యాడికి: మండలకేంద్రంలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన సోదరుడు వీకే విశ్వనాథరెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య రైతు సంఘం నాయకుడు వెంకటరాముడుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రఫీ, సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని నెహ్రూపార్కులో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణ సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వీరన్నకు ఘన నివాళి

గుత్తి/ పెద్దవడుగూరు, జూలై18: పట్టణంలోని జడ్‌వీరారెడ్డి కాలనీలో సీపీఎం నాయకుడు వీరన్న వర్ధంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరన్న పేద సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరంగయ్య, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలం కిష్టిపాడులో కూడా వారు స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు

బాలిక ఆత్మహత్య

రాయదుర్గంరూరల్, జూలై 18: మండలంలోని డీ కొండాపురం గ్రామానికి చెందిన జస్సిక(16) ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జంగలనాయుడు, రుద్రమ్మ దంపతుల కుమార్తె జస్సిక ఈ ఏడా ది 10వ తరగతి ఉత్తీర్ణత సాధించింది. పై చదువులకు వెళ్లాలని తల్లిదం డ్రులు కోరడంతో ఆమె సుముఖత చూపడం లేదు. ఈ క్రమంలో గురువారం క్షణికావేశానికి లోనై ఇంట్లోఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు గమనించి కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సచివాలయానికి ఫొటోల అందజేత

కుందుర్పి, జూలై 18 : మండలంలోని అపిలేపల్లి గ్రామ సచివాలయానికి టీడీపీ, జనసేన నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలను అందించారు. సచివాలయ సిబ్బందికి గురువారం వారు వాటిని అందజేశారు. నాయకులు కేపీ రామాంజినేయులు, రామాంజినేయులు, ఏవి చలపతి, వీరాంజనేయులు, ఓబుళేసు, భీమప్ప, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ఉరవకొండ,జూలై18: పట్టణంలోని జనసేన కార్యాలయంలో గురువారం ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు చంద్రశేఖర్, కేశవ, గోపాల్, సుధీర్, నగేష్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

గుత్తి, జూలై 18: స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో గురువారం క్రీడా పోటీలను డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందులో వాలీబాల్, లాంగ్ టెన్నిస్, క్యారం, షటిల్, టెబుల్ టెన్నిస్, చెస్, క్రికెట్, తదితర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుపుతామన్నారు. గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే ఇనిస్టిట్యూట్ వైస్ చైర్మన్ మనోజ్, సెక్రెటరీ రవికుమార్, కోశాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించండి

కూడేరు, జూలై 18: మండలంలో కౌలు రైతులను గుర్తించాలని తహసీల్దార్ రత్నరాధిక సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. పంటసాగు హక్కు పత్రాలను జారీ చేయడానికి కౌలు రైతులను గుర్తించాలని తెలిపారు. ఏఓ విజయ్ కుమార్, ఏఈఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

గుంతకల్లు టౌన్, జూలై 18: పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ సమీపంలో గల రెండు దుకాణాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలయని దుండగులు అక్కడి జేకే సెలూన్ షాపు షట్టర్ తాళాలను పగులగొట్టి లోపలకి చొరబడి రూ.5వేలు ఎత్తుకెళ్లారని ఆ షాపు యజమాని హరీష్ తెలిపారు. అలాగే నూర్ ఆప్టికల్స్ షాపులో చొరబడి రూ.10వేల నగదు, ర్యాక్‌లో పెట్టిన కళ్లజోళ్లు ఎత్తుకెళ్లారని యజమాని షేక్ రోషన్ జమీర్ తెలిపారు. మరో సెలూల్ షాపు తాళాలను పగలగొట్టి లోపలకి చొరబడ్డారని, అయితే తమ షాపులో ఏమీ పోలేదని ఆ షాపు నిర్వాహకుడు తెలిపారు. సంఘటనపై బాధితులు వన్‌టౌన్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.